సమాజానికి సంజీవని.. యోగా

● పలు చోట్ల యోగా దినోత్సవ కార్యక్రమాలు

గోపాలపట్నం: అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా పలు చోట్ల ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. జీవీఎంసీ 52వ వార్డు శాంతినగర్ పార్క్‌లో పతంజలి యోగాపీఠ్ ఆధ్వర్యంలో యోగా దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగా వల్ల శారీరక ఆరోగ్యమే కాకుండా మానసిక ఆరోగ్యం కూడా బాగుంటుందని తెలిపారు. నేటి యువత యోగా చేయాలని సూచించారు. యోగాసనాలను చిన్నారులు ప్రదర్శించారు. అనంతరం పతంజలి యోగా పీఠ్ సభ్యులు శ్రీధర్‌ను ఘనంగా సత్కరించారు.

గోపాలపట్నం పాఠశాలలో

జేడీ ఫౌండేషన్, గోపాలపట్నం జిల్లా పరిషత్ పాఠశాల సంయుక్త ఆధ్వర్యంలో పాఠశాల ఆవరణలో అంతర్జాతీయ యోగా దీనోత్సవం నిర్వహించారు. విద్యార్థులచే సూర్య నమస్కారాలు, వీరభద్రాసనం తదితర యోగాసనాలు వేయించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వై. వేణుగోపాల్ మాట్లాడుతూ యోగాసనాలను పాఠశాలలో నేర్పిస్తామని తెలిపారు. విద్యార్థులు వీటిని అలవరుచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ సత్యకళ, జేడీ ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..

అజంతా పార్క్‌లో అంతరాతీయ యోగా దినోత్సవం నిర్వహించారు. వాకర్స్ సభ్యులు యోగాసనాలు వేశారు. వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ యోగాసనాల ద్వారా ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో కనకారావు, ప్రసాద్, కోటేశ్వరరావు, బి. నాయుడు, వైఎస్సార్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఏడీలో

నేవల్ ఆర్మ్‌మెంట్ డిపో కాలనీ గ్రౌండ్‌లో యోగా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఏడీ సీఎండీ పీజే నివారి మాట్లాడుతూ యోగా ఆధ్యాత్మిక వ్యాయామ సాధనంగా ప్రాముఖ్యత సంతరించుకుందని అన్నారు. దీని వల్ల మానసిక, శారీరక ఆరోగ్యం కలుగుతుందని అన్నారు. ప్రతి ఒక్కరూ నిత్యకృత్యంగా యోగాను అలవరుచుకోవాలన్నారు.


గోపాలపట్నం హైస్కూల్లో యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు

ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు, కార్మికులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో ..

మల్కాపురం : పారిశ్రామిక ప్రాంతంలో గల పలు జీవీఎంసీ ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో యోగా వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. అంతర్జాతీయ యోగా దినోత్సవంలో భాగంగా 61వ వార్డు మల్కాపురం, జీవీఎంసీ ఉన్నత పాఠశాల వద్ద బ్రహ్మర్షి పితామహ పత్రీజీ దివ్య ఆశీస్సులతో ఈ కార్యక్రమాలు జరిగాయి. స్థానిక అహింస పిరమిడ్ ధ్యాన కేంద్రం ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులకు మాస్టర్ అప్పలరాజు యోగాలో మెలకువలు బోధించారు. కార్యక్రమంలో బాలాజీ, చిన్నారావు, కనకారావు తదితరులు పాల్గొన్నారు. అలాగే శ్రీహరిపురం జీవీఎంసీ ఉన్నత పాఠశాల వద్ద ఉపాధ్యాయులు ప్రకాష్ తదితరులు విద్యార్థులకు యోగాలో మెలకువలు నేర్పారు. స్థానిక భాష్యం పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు నాగజ్యోతి విద్యార్థులకు యోగా వలన కలిగే ప్రయోజనాలు వివరించారు.


శాంతినగర్ పార్క్‌లో యోగా దినోత్సవాన్ని ప్రారంభిస్తున్న జియ్యాని శ్రీధర్


అజంతా పార్క్‌లో ఆసనాలు వేస్తున్న వాకర్స్ అసోసియేషన్ సభ్యులు..


మల్కాపురం పాఠశాలలో యోగా చేస్తున్న విద్యార్థులు


భాష్యం పాఠశాలలో యోగా చేస్తున్న విద్యార్థులు

క్లుప్తంగా

మేహాద్రి గెడ్డ వద్ద గజ ఈతగాళ్లు

● డిప్యూటీ మేయర్ జియ్యాని


డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్

గోపాలపట్నం: మేహాద్రి గెడ్డ జలాశయం వద్ద త్వరలో గజ ఈతగాళ్లు రానున్నారు. తరచూ ప్రమాదాలు చోటు చేసుకుని పలువురు మృత్యువాత పడుతున్నారు. సమస్యను పలువురు డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీదర్ దృష్టికి తీసుకు వచ్చారు. దీంతో ఇటీవల ఆయన జీవీఎంసీ కౌన్సిల్ సమావేశంలో మేహాద్రి గెడ్డ జలాశయంలో ప్రమాదాల నివారణకు గజ ఈతగాళ్లను ఏర్పాటు చేయాలని కోరారు. దీంతో స్పందించిన నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, కమిషనర్ సాయికాంత్ వర్మ ఆమోదించారు. త్వరలో గజీతగాళ్లు మేహాద్రి గెడ్డ వద్ద అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. తన అభ్యర్థనను ఆమోదించిన మేయర్, కమిషనర్‌లకు జియ్యాని కృతజ్ఞతలు తెలిపారు.

దిశ పోలీసుల విచారణ


ఎన్ఏడీ జంక్షన్‌లో విచారణ చేస్తున్న దిశ డీఎస్పీ వివేకానంద్

గోపాలపట్నం: ఎన్ఏడీ ఫ్లై ఓవర్ బ్రిడ్జి దిగువన బాలికపై వృద్ధుడు లైంగికదాడికి యత్నించిన ఘటనపై దిశ పోలీస్ స్టేషన్ డీఎస్పీ వివేకానంద్ విచారణ చేపట్టారు. నాలుగేళ్ల బాలికపై 60 ఏళ్ల వృద్ధుడు లైంగికదాడికి యత్నించిన విషయం తెలిసిందే. ఈ కేసును ఎయిర్‌పోర్టు జోన్ పోలీసులు దిశ పోలీస్ స్టేషన్‌కు బదలాయించారు. దీంతో దిశ పోలీసులు విచారణ చేపట్టారు. ఈ మేరకు ఫిర్యాది రోజామణి సమక్షంలో స్థానికుల నుంచి వివరాలు సేకరించారు. కేసు నమోదు చేశామని, దర్యాప్తు చేస్తున్నామని వివేకానంద్ తెలిపారు.

నేడు సహస్ర తులసీ దళార్చన

దాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మి దేవాలయంలో ప్రతి గురువారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సహస్ర తులసిపూజ నిర్వహించనున్నారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 080810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806091లో చెల్లించాలి. ఆన్‌లైన్ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేసిన భక్తులు వివరాలు, పూజ జరిపించాల్సిన వారి పేరు, గోత్రనామాలు, పూర్తి చిరునామా, ఫోన్ నంబరును 8985515989 నంబరుకు వాట్సప్ చేయాలి.

23న డిగ్రీ సబ్జెక్టులపై అవగాహన

దాబాగార్డెన్స్: జాతీయ విద్యా విధానం-2020 ప్రకారం డిగ్రీ కోర్సుల్లో ప్రవేశపెడుతున్న డిగ్రీ ఆనర్స్, సింగిల్ మేజర్ సబ్జెక్టులపై విద్యార్థులు, తల్లిదండ్రులకు ఈ నెల 23న దాబాగార్డెన్స్‌లో గల ఆదిత్య డిగ్రీ కళాశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీఎస్‌సీహెచ్‌ఈ ఆదేశాల మేరకు ఆ రోజు ఉదయం 10 గంటలకు నిర్వహించనున్న అవగాహన సదస్సులో ఇంటర్మీడియట్ పూర్తి చేసిన విద్యార్థులు పాల్గొని నాలుగు లేదా మూడేళ్ల డిగ్రీ గురించి అవగాహన పెంపొందించుకోవచ్చని తెలిపారు. స్కిల్ డెవలప్‌మెంట్, మల్టీ డిసిప్లినరీ వంటి కోర్సుల పట్ల పట్టు సాధించవచ్చని, ఈ అవగాహన సదస్సును ఇంటర్మీడియట్ పూర్తి చేసిన విద్యార్థులు వినియోగించుకోవాలన్నారు.

కాటమ్మవారికి ఘనంగా పూజలు

సీతమ్మధార: పీ అండ్ టీ కాలనీలో కొలువైన శ్రీ కాటమ్మ అమ్మవారి ఆలయ పదో వార్షికోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి ఉద యం పంచామృతాభిషేకం, విశేష పూజ లు చేశారు. కాటమ్మను ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ఈ సందర్భంగా పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. శ్రీ కాటమ్మ, శ్రీ నాగమ్మ అమ్మవార్లకు వెండి తొడుగులు (5.5 కిలోలు) ధరించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

బాగు పడిన సాకేతపురం రహదారి


కార్పొరేటర్ ముర్రి వాణిని సత్కరిస్తున్న ఎన్ఏడీ సీఈ యూనియన్ సభ్యులు

గోపాలపట్నం: జీవీఎంసీ 57 వార్డు సాకేతపురం వాసుల కష్టాలు తీరాయి. గుంతలమయంగా మారిన రోడ్డును బాగు చేశారు. దీంతో ఎన్ఏడీ ఉద్యోగులతో పాటు స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు 57వ వార్డు కార్పొరేటర్ ముర్రు వాణిని బుధవారం ఎన్ఏడీ సీఈ యూనియన్ సభ్యులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకుడు నూకరాజు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ పశ్చిమ ఇన్‌చార్జి ఆడారి ఆనంద్‌కుమార్, డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, కార్పొరేటర్ ముర్రు వాణి దృష్టికి రహదారి దుస్థితిని ఎన్ఏడీ సీఈ యూనియన్ వర్క్స్ కమిటీ సభ్యులు తీసుకెళ్లారు. దీంతో వెంటనే స్పందించి రహదారి వేశారని తెలిపారు. జాతీయ రహదారి నుంచి ఎన్ఏడీ మొదటి గేటు వరకు రహదారిని అభివృద్ధి పరిచారు. రహదారి వేసేందుకు సహకరించిన ఎన్ఏడీ మేనేజ్ మెంట్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

మహిళలకు కుట్టు శిక్షణ


కార్యక్రమంలో మాట్లాడుతున్న కోరమాండల్ అధికారులు


మల్కాపురం: జీవీఎంసీ 58వ వార్డు శ్రీరామ్‌నగర్ సామాజిక భవనంలో మహిళలకు కుట్టు మిషన్‌లో ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం చేపట్టారు. కోరమాండల్ సంస్థ సహకారంతో ఈ శిబిరం నిర్వహిస్తున్నారు. కోరమాండల్ అధికారులు ఎస్. వెంకటరమణ,విష్ణు మాట్లాడుతూ తమ సంస్థ ఆధ్వర్యంలో సుమారు 80 మహిళలకు మూడు నెలల పాటు కుట్టు మిషన్‌లో శిక్షణ ఉచితంగా ఇస్తామన్నారు.స్థానిక మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కోరమాండల్ అధికారి ధర్మాల వేణుగోపాలరెడ్డి, గ్రామ పెద్దలు కాసులు,అప్పలరెడ్డి,రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

తుది దశకు చేరుకున్న మెట్ల నిర్మాణం


శ్రీవారి ఆలయం వద్ద నిర్మిస్తున్న మెట్లు


కొమ్మాది: రుషికొండలో గల శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయానికి భక్తులు నడుస్తూ చేరుకునేందుకు మెట్ల నిర్మాణం పనులు దాదాపు పూర్తయ్యాయి. మెట్ల నిర్మాణం పూర్తికాగా వాటి చుట్టూ గోడ, పైన శ్లాబ్ పనులు ప్రస్తుతం కొనసాగుతున్నాయి. శ్రీవారి ఆలయానికి చేరుకునేందుకు ఇప్పటికే సుందరమైన ఘాట్ రోడ్డు అందుబాటులో ఉంది. కొండ దిగువ భాగం నుంచి ఘాట్ రోడ్డులోని చివరి మలుపు వరకు ఉన్న శ్రీవారి శంఖు, నామ, చక్రాల వరకు ఈ మెట్లు ఉంటాయి. అక్కడ నుంచి కేవలం 50 మీటర్ల దూరంలో ఆలయం ఉండటంతో భక్తులు సులభంగానే చేరుకోవచ్చు. మొత్తం 240 మెట్లు, మధ్యమధ్యలో ప్లాట్ ఫారం నిర్మిస్తున్నారు. తిరుపతి తరహాలో భక్తులకు ఎండతోగానీ, వర్షంతోగానీ ఇబ్బంది లేకుండా ఉండేదుకు వీలుగా షెల్టర్లు ఏర్పాటు చేస్తున్నారు. దీంతో భక్తులు క్షేమంగా ఆలయానికి చేరుకుని శ్రీవారిని దర్శించుకోవచ్చు. మెట్ల నిర్మాణ పనులు 90 శాతం పూర్తయ్యాయని, శ్రావణ మాసంలో అందుబాటులోకి తీసుకొస్తామని టీటీడీ ఏఈవో జగన్ మోహనాచార్యులు తెలిపారు. భక్తులు సులువుగా మెట్ల మార్గం ద్వారా ఆలయానికి చేరుకుని శ్రీవారిని దర్శించుకునే అవకాశం ఉంటుందని ఆయన తెలిపారు.

ఓపెన్ ఎయిర్ థియేటర్ సందర్శన


ఓపెన్ ఎయిర్ థియేటర్‌ను సందర్శిస్తున్న హేమచంద్రారెడ్డి తదితరులు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఆధునికీకరించిన ఓపెన్ ఎయిర్ థియేటర్‌ను రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ఆచార్య కె.హేమచంద్రారెడ్డి బుధవారం సందర్శించారు. విశాఖకు విచ్చేసిన ఆయన ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి. ప్రసాదరెడ్డితో కలిసి వర్సిటీలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. కళలకు నిలయంగా ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని నిలిపే దిశగా ఆరుబయలు రంగస్థలాన్ని పూర్తి స్థాయిలో ఆధునికీకరించామని వీసీ తెలిపారు. దీనిపై ఉన్నత విద్యా మండలి చైర్మన్ సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, తదితరులు పాల్గొన్నారు.

సమయపాలనకు ప్రాధాన్యం


విద్యార్థులకు టైమ్ మేనేజ్‌మెంజ్‌పై అవగాహన కల్పిస్తున్న ఎస్.వి.ఆర్.నాయుడు

మురళీనగర్: ప్రతి విద్యార్థి సమయపాలనకు ప్రాధాన్యమివ్వాలని న్యూరో లింగ్విస్టిక్స్ ప్రొగ్రాం మాస్టర్ ట్రైనర్ (యు.ఎస్.ఎ.), రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ గెస్ట్ ఫ్యాకల్టీ, వ్యక్తిత్వ వికాస శిక్షణ నిపుణుడు ఎస్.వి.ఆర్. నాయుడు అన్నారు. సాంకేతిక విద్యా శాఖ కమిషనర్ సి.నాగరాణి ఆదేశాల మేరకు విశాఖ ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో పాలిసెట్ కౌన్సెలింగ్‌లో పాల్గొన్న విద్యార్థులకు నిర్వహిస్తున్న ఓరియంటేషన్ కార్యక్రమంలో బుధవారం ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. స్టడీ స్కిల్స్ అండ్ టైం మేనేజ్‌మెంట్ పద్ధతులపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. సబ్జెక్టుల్లో నైపుణ్య సాధనకు కాలాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఒక ప్రణాళిక ప్రకారం చదవడంతోపాటు నైపుణ్యాల సాధన, కమ్యూనికేషన్ స్కిల్స్‌పై పట్టు సాధించాలన్నారు. తద్వారా ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయన్నారు. విద్యార్థులు అడిగిన పలు సందేహాలను ఎస్.వి.ఆర్.నాయుడు నివృత్తి చేశారు. కాలేజీ ప్రిన్సిపాల్ నరసింహారావు, జనరల్ విభాగాధిపతి డాక్టర్ పి.ఎం.బాషా, ఇంగ్లిష్ సీనియర్ లెక్చరర్ డాక్టర్ కె.యమున, ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ లెక్చరర్ ఎస్.నాగరాజు పాల్గొన్నారు.

అత్యాధునికంగా ప్రేమసమాజం ఆడిటోరియం

దాబాగార్డెన్స్: అత్యాధునికంగా రూపొందించిన ప్రేమసమాజం ఆడిటోరియంను బుధవారం అధ్యక్షుడు పైడా కృష్ణప్రసాద్ ప్రారంభించారు. మొదటి అంతస్తు నూతన టెక్నాలజీతో నిర్మించినట్లు తెలిపారు. ఎప్పటి నుంచో ఉన్న ప్రేమసమాజం ఆడిటోరియం నగర కళాకారులు కార్యక్రమాలు నిర్వహించుకునేందుకు వీలుగా ఉండేదన్నారు. అధునాతన రీతిన ఏసీ సౌకర్యం.. మంచి సౌండ్ సిస్టమ్‌తో ఆడిటోరియం రూపొందించినట్లు తెలిపారు. ప్రేమసమాజం పూర్వ అధ్యక్షుడు కంచర్ల రాంబ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

మర్యాదపూర్వక కలయిక


ఎమ్మెల్యే గణబాబుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎయిర్‌పోర్టు డైరెక్టర్ రాజారెడ్డి

గోపాలపట్నం: ఎయిర్‌పోర్టు డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన రాజారెడ్డి పశ్చిమ ఎమ్మెల్యే గణబాబును బుధవారం గోపాలపట్నంలో ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. విశాఖ విమానాశ్రయం అభివృద్ధికి సహకరించాలని కోరారు. విమానాశ్రయం అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే గణబాబు తెలిపారు.

పోలమాంబ కల్యాణ మండపం నిర్వహణకు వేలం

ఏయూక్యాంపస్: పెదవాల్తేరులోని శ్రీకరకచెట్టు పోలమాంబ ఆలయంలో ఉన్న కల్యాణ మండపం నిర్వహణకు వేలం పాట ప్రక్రియ చేపట్టారు. బుధవారం ఆలయంలో నిర్వహించిన బహిరంగ వేలం పాటలో రెండేళ్లకు వేలం వేయగా.. ఏడాదికి రూ.45.65 లక్షలకు నగరానికి చెందిన సింహాద్రి దక్కించుకున్నారు. రెండో ఏడాది పది శాతం అద్దెను పెంచనున్నారు. రెండేళ్ల కిందట వేలం వేయగా రూ.37.80 లక్షలకు వెళ్లింది. ఈ సారి రూ.7.85 లక్షలు అధికంగా వేలం పాట సాగింది. మొత్తం ఏడుగురు కల్యాణ మండపం కోసం పోటీ పడ్డారు.

ఆలయ ప్రాంగణంలో షాపు నంబరు-1కు వేలం పాట నిర్వహించగా.. రూ.11,300కు దక్కించుకున్నారు. కల్యాణ మండపం నిర్వహణను జూలై 1 నుంచి నూతన కాంట్రాక్టర్‌కు అప్పగించనున్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో డి.వి.ఎస్ సురేష్‌బాబా, ఆలయ చైర్మన్ పి.శంకర్‌రెడ్డి, ధర్మకర్తలు, పెదవాల్తేరు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

860వ రోజుకు 'ఉక్కు'రిలే దీక్షలు


860వ రోజు దీక్ష శిబిరంలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: దేశంలోనే పెద్ద పరిశ్రమగా అవతరించిన విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేట్ వ్యక్తులకు అమ్మాలనుకోవడం దారుణమని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. దీనిని అడ్డుకుని తీరతామన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద జరుగుతున్న రిలే నిరాహార దీక్షల్లో 860వ రోజు బుధవారం సంస్థలోని పలు విభాగాల కార్మికులు పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వం ఎన్ని కుట్రలు చేసినా కార్మికులు ప్రతిఘటిస్తారని, ఉక్కు పరిశ్రమలోని ఒక్క రేకును కూడా కదల్చలేనివ్వరని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం తన నిరంకుశత్వ నిర్ణయాన్ని వదిలి, కార్మికులకు అండగా నిలబడాలని కోరారు. విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రభుత్వరంగ సంస్థగానే కొనసాగిస్తున్నట్లు ప్రకటించాలన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

చిన్నారులకు పౌష్టికాహారం పంపిణీ

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం ప్రాంతానికి చెందిన సామాజిక సేవా కార్యకర్త కాకి సంతోష్ బుధవారం మల్కాపురంలో చిన్నారులకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. తన సొంత నిధులతో మల్కాపురం ,శ్రీహరిపురం తదితర ప్రాంతాల్లో పలువురి చిన్నారులకు బిస్కెట్‌లు,కేక్‌లు పంపిణీ చేసినట్టు చెప్పారు.

గంట్ల శ్రీనుబాబుకు పితృ వియోగం


తాతారావు మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్


సింహాచలం: వీజేఎఫ్ అధ్యక్షుడు, శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యుడు గంట్ల శ్రీనుబాబు తండ్రి తాతారావు(74)బుధవారం తెల్లవారుజామున అస్వస్థతతో మృతి చెందారు. తాతారావు పెందుర్తి ఎంపీడీవో కార్యాలయంతో పాటు జిల్లా పరిషత్ కార్యాలయంలో సుదీర్ఘకాలం పని చేశారు. సింహాచలంలోని స్వగృహం వద్ద తాతారావు పార్థివ దేహానికి డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, జీవీఎంసీ అదనపు కమిషనర్ యాదగిరి శ్రీనివాసరావు, జీవీఎంసీ ఉద్యోగుల గుర్తింపు సంఘం అధ్యక్షుడు ఎమ్.ఆనందరావు, డాక్ యార్డు అసోసియేషన్ ప్రతినిధులు, అడవివరం గ్రామస్తులు నివాళులర్పించారు.

తానా సభలకు జియ్యానికి ఆహ్వానం


తానా సభలకు ఆహ్వానం అందుకున్న జియ్యాని మారుతేశ్వరరావు కుటుంబ సభ్యులు

గోపాలపట్నం: తానా సభలకు హాజరు కావాలని జీవీఎంసీ 52వ వార్డు శాంతినగర్‌కు చెందిన జియ్యాని మారుతేశ్వరరావు, ఆయన భార్య వెంకటసత్యవతికి ప్రత్యేక ఆహ్వానం అందింది. తానా అధ్యక్షుడు అంజయ్య చౌదరి లావు, తానా కాన్ఫరెన్స్ కో ఆర్డినేటర్ రవి పొట్లూరి పేరుతో ఆహ్వానం పత్రం వచ్చింది. జులై నెల 7 నుంచి 9 వరకు ఫిలాడెల్ఫియా నగరంలో పెన్సిల్వేనియా కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించే కార్యక్రమంలో పాల్గొవాలని కోరారు. వెంకటసత్యవతి మైక్రో బయాలజీలో పీహెచ్‌డీ పూర్తి చేశారు. ఈ ఆహ్వానం రావడంపై వారు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఏఎంసీ వార్షిక క్రీడాపోటీలు ప్రారంభం


త్రోబాల్ పోటీల్లో 2కే20 జట్టు తరఫున మద్ది సర్వ్‌ను ఎదుర్కొంటున్న ఈకె22జట్టు

విశాఖ స్పోర్ట్స్: పేస్-23 పేరిట నిర్వహిస్తున్న ఏఎంసీ వార్షిక క్రీడా పోటీలు బుధవారం మేజర్ ఎడ్విన్ స్మారక గ్రౌండ్‌లో ప్రారంభమయ్యాయి. ఏఎంసీ సెంటినరీ వేడుకల్లో భాగంగా జరుగుతున్న ఈ పోటీలను ఏఎంసీ ప్రిన్సిపాల్ జి.బుచ్చిరాజు ప్రారంభించారు. స్టూడెంట్స్‌కు క్రికెట్, వాలీబాల్, బాస్కెట్‌బాల్, ఫుట్‌బాల్, బాల్‌బ్యాడ్మింటన్, బ్యాడ్మింటన్, త్రోబాల్, టెన్నిస్, టీటీ, చెస్, క్యారమ్ పోటీలు, ఫ్యాకల్టీకి క్రికెట్, త్రోబాల్, చెస్, క్యారమ్, టీటీ, బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించనున్నారు. పోటీలను పీడీ పాత్రుడు, నిర్వాహక ప్రతినిధులు కార్తీక్, హర్షిత, చెన్నకేశవ, శివసత్య పర్యవేక్షిస్తున్నారు. త్రోబాల్ ప్రారంభ పోటీలో 2కె20 బ్యాచ్ జట్టుతో 2కె22 బ్యాచ్ జట్టు తలపడింది. తొలిరోజు మెన్‌కు క్రికెట్, బాల్ బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించారు.

సమాజ పోకడలను ప్రతిబింబించేలా కథలు


మాట్లాడుతున్న రచయిత హనుమంతరావు

సీతంపేట: సమాజ పోకడలను కథలు ప్రతిబింబించాలని రచయిత ఎస్.హనుమంతరావు అన్నారు. సహృదయ సాహితి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక ప్రిజమ్ కళాశాలలో కొత్త కథల-22 సంకలనంపై జరిగిన చర్చా గోష్ఠిలో ఆయన మాట్లాడారు. యువ కథా రచయితలు వివిధ సామాజిక అంశాలను ఎంచుకుని చక్కని కథనంతో రాశారన్నారు. ఈ సంకలనంలో పెద్దింటి అశోక్‌కుమార్, ఉమా నూతక్కి, మన్ ప్రీతం, సుజాత వేల్పూరి, కుమార్ కూనపరాజు, ఖదీర్‌బాబు మున్నగు రచయితలు రాసిన కథలున్నాయని తెలిపారు. వర్తమాన సమాజ పోకడలను, కథా వస్తువులో భిన్నత్వం, శైలి, శిల్పాలపై ప్రత్యేక దృష్టి రచయితలకు ఉండాలని సూచించారు. కార్యక్రమంలో శేఖరమంత్రి ప్రభాకర్, కె.జి. వేణు, డి.వి.సూర్యారావు, కె.వి.ఎస్.మూర్తి, అడపా రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

'రైజ్ ఆఫ్ ది ప్రౌడ్ ఇంట్రావర్ట్స్' పుస్తకావిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

సీతంపేట: నగరానికి చెందిన యువ రచయిత నిమ్మాని సంతోష్ రచించిన 'రైజ్ ఆఫ్ ది ప్రౌడ్ ఇంట్రావర్ట్స్' పుస్తకావిష్కరణ సభ బుధవారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో జరిగింది. ముఖ్య అతిథులు ఆర్ఎస్ఎస్ సంఘ చాలక్ పి.వి.నారాయణరావు, బీజేపీ కన్వీనర్ కొప్పల రామ్‌కుమార్, జీవీపీ కళాశాల డైరెక్టర్ డాక్టర్ రవిశంకర్ నరిపల్లే, విశాఖ స్టీల్‌ప్లాంట్ జీఎం కె.వి.రావు చేతుల మీదుగా పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రచయిత సంతోష్ మాట్లాడుతూ ఇంట్రోవర్ట్స్ అంటే అంతర్ముఖులని, నిజ జీవితంలో మనం ఇలాంటి వారిని చూస్తుంటామన్నారు. ఎవరితో ఎక్కువగా మాట్లాడకుండా, జనాలకు దూరంగా, కలుపుగోలు తనం లేకుండా కొంతమంది మనకు తారసపడుతుంటారన్నారు. అటువంటి వారిని ఏ విధంగా మామూలు వ్యక్తులుగా మార్చుకోవాలి దానికి సంబంధించిన టెక్నిక్స్, ఎక్సర్‌సైజ్‌లు పుస్తకంలో పొందుపర్చినట్లు తెలిపారు. ఇది ప్రతి ఒక్కరూ చదవాల్సిన పుస్తకమని అతిథులు పేర్కొన్నారు. బుక్ మ్యాజిక్ లైబ్రరీ వ్యవస్థాపకుడు హరి మాదాల, పిక్ ఏ బుక్ సంస్థ ప్రతినిధికృష్ణకిరణ్ పుస్తకాన్ని సమీక్షించారు.